క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెంకన్నగూడలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబమాత దేవాలయానికి రమేశ్‌నాయక్, అమర్‌సింగ్ సోమవారం రూ.1లక్ష విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాత్లావత్ రాంచందర్, దేవులానాయక్, సక్రునాయక్, టోపియా లక్ష్మణ్‌నాయక్, రాములు, కిష్టానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని ఎంపీకి వినతి

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ నుంచి సంజీవపురం చింతల వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి వయా లక్ష్మీదేవిపల్లె మీదుగా కొల్లూర్ వరకు రోడ్డు వేయించాలని విశ్వనాథ్‌పూర్ గ్రామస్తులు ఎంపీ డీకె అరుణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు నిర్మించడంతో విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల రైతులకు అనుకూలంగా ఉంటుందని, అదేవిధంగా మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి బైపాస్ రోడ్డుగా మారుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి శివారెడ్డి, వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్టారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అడ్మిషన్ పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం రేణుక అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటిరోజు విద్యార్థులు క్యూలో నిలబడి అడ్మిషన్లు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌తో పాటు వ్యాపారవేత్తలుగా, విద్యావేత్తలుగా ఎదిగారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, రీడింగ్ బుక్స్, స్కూల్ యూనిఫామ్ అందిస్తున్నారన్నారు. మొదటిరోజు ఆరో తరగతిలో చేరిన విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు శివశంకర్

షాద్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ విక్రయిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. పాఠశాలల్లో విక్రయించిన పుస్తకాలను మాత్రమే కొనుగోలు చేయాలని పాఠశాల వారు ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలను అధికారులు గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, అశోక్, తరుణ్, రాజు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కేశంపేట: భూ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు నాయకులతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, రూప్లానాయక్, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా.. ముందుకు సాగక

- నత్తనడకన తొండుపల్లి-కొత్తూరు జాతీయ రహదారి పనులు
- వంతెనల కోసం తవ్విన గుంతలతో తరచూ ప్రమాదాలు
- రూ.260 కోట్లతో నిర్మాణం



రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు

కొత్తూరు: హైదరాబాద్ మహానగరం ప్రస్తుతం అన్ని రంగాల్లో శరవేగంగా విస్తరిస్తుండడంతో నిత్యం నగరానికి వేల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి గుండా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ రోడ్డుపై విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు రోడ్డును విస్తరించడానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2022లో కేంద్రమంత్రి నితిన్ గడ్కారి తొండుపల్లి-కొత్తూరు వరకు చేపట్టనున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. పనులు ఆలస్యం కావడం కారణంగా రోడ్డు విస్తీర్ణం తగ్గడంతో ఆయా కూడళ్ల వద్ద తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

11.8కి.మీ మేర నిర్మాణం

గత మూడేళ్ల క్రితం సుమారు రూ.260 కోట్లతో తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 11.8 కిలోమీటర్ల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మూడేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. నాలుగు వరుసలుగా ఉన్న రోడ్డును ఆరు వరుసలుగా మార్చడంతో పాటు గ్రామాలు, కూడళ్లు వచ్చే చోట అండర్‌పాస్‌ను నిర్మిస్తున్నారు. గండిగూడ, ఘంసిమీయాగూడ, పెద్దషాపూర్, షాపూర్‌తండా, మదనపల్లి, పాలమాకుల, చేగూరు రోడ్డు, తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రమాదాల నివారణకు అండర్‌పాస్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ కాంట్రాక్ట్‌ను లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకుంది. ఈ పనులను నిర్ణీత గడువు 2026 మార్చి 26లోగా పూర్తి చేయాల్సి ఉంది. కాగా పనులు ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా యాభై శాతం కూడా పూర్తికాలేదు.

గుంతలతో ప్రమాదాలు

రోడ్డు విస్తరణలో భాగంగా పలుచోట్ల వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు భారీ గుంతలు తవ్వారు. దీంతో రోడ్డు విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. దానికి తోడు జాతీయ రహదారి కావడం తమిళనాడు, కేరళ, రాయలసీమతో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన వారు ఈ రోడ్డు గుండానే హైదరాబాద్‌కు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఏళ్ల తరబడి పనులు సాగకపోవడం.. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు ఆయా కూడళ్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంటూ ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



రోడ్డు విస్తీర్ణం తగ్గడంతో ట్రాఫిక్ జామ్

“గడువులోగా పూర్తిచేస్తాం

తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలి. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేస్తాం.

– నరేశ్, ప్రాజెక్ట్ అధికారి

వంతెనల నిర్మాణాలతో ప్రమాదాలు తగ్గుతాయి



తొండుపల్లి నుంచి కొత్తూ రు వరకు సుమారు 11.8 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డులో ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పలుచోట్ల వంతెనలు నిర్మిస్తున్నారు. దానికి తోడు జేపీదర్గా, కేశంపేట్‌రోడ్డు, చటాన్‌పల్లి, కూడళ్ల వద్ద కూడా భారీ ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే



విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల, నాయకులు

తీరిన 11కేవీ లైన్ సమస్య

- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ ఎల్లమ్మగడ్డ కాలనీలో సుమారు 30 ఇళ్లు, ప్లాట్ల నుంచి 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఎట్టకేలకు ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమైనందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన గ్రామంలో అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందరూ కలిసి ఆయనకు ఇళ్ల పైనుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ అధికారులు గ్రామంలో పర్యటించి విద్యుత్ లైన్‌ను మార్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో కొత్త రూట్‌లో హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. హైటెన్షన్ లైన్ పనులను జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల శ్రావణ్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పరిశీలించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలేమోని శివయ్య, అబ్బి సుందరయ్య, పల్లాటి లక్ష్మీనారాయణ, కుర్వగూడెం నర్సింలు, పర్వతాలు, చెవెళ్ల నర్సింలు, యాదయ్య, సుదర్శన్‌గౌడ్, రాఘవేందర్, దేవేందర్, కుమ్మరి శేఖర్, సూరమోని యాదయ్య, సిల్వేరు రవీందర్, రామకృష్ణ, రాంచందర్, శాంతయ్య, శ్రీను పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- కాంగ్రెస్ సీనియర్ నేత శేఖర్‌రెడ్డి

కొత్తూరు: మారుతున్న సమాజానికి అనుగుణంగా ప్రస్తుత పోటీ రంగంలో చదువుకుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన బడిబాటతో పాటు హెచ్‌ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంతో పాటు నిరుద్యోగులకు అన్ని విధాలుగా సాయం చేసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కేంద్రాల ద్వారా నిరుద్యోగులకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మొయినాబాద్‌రూరల్: బాకారంలో ఫిర్యాదులు తీసుకుంటున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



చేవెళ్ల: దేవునిఎర్రవల్లిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య



కేశంపేట: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయబ్ తహసీల్దార్ గీత

- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- పాల్గొన్న అధికారులు, రెవెన్యూ సిబ్బంది

చేవెళ్ల: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దేవునిఎర్రవల్లి, మల్కాపూర్ వార్డులలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దేవునిఎర్రవల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేవునిఎర్రవల్లిలో 36 ఫిర్యాదులు రాగా, మల్కాపూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో 30 ఫిర్యాదులు వచ్చినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు మానిక్యరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌లో...

మొయినాబాద్: మండలంలోని శ్రీరాంనగర్‌లో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 50 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాకారంలో 64 ఫిర్యాదులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో భూభారతి తహీల్దార్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాకారంలో 64 ఫిర్యాదులు అందాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ మాడి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో..

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ అజాంఅలీ, నాయబ్ తహసీల్దార్ గీత, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, పల్లె అనంద్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, ఇబ్రహీం, కర్ణాకర్‌రెడ్డి, రూప్లా నాయక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించి సందేశాన్ని విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు రైతుల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సకాలంలో రైతు భరోసాను, రైతు రుణమాఫీని అందించినట్లు స్పష్టం చేశారు. ఈ వానాకాలం రైతు భరోసాను ఒకేసారి అందరికీ అందించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు సురేశ్‌బాబు, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్స్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకుడు జానార్దన్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, యాదగిరి, పాడు, రాములు, లక్ష్మారెడ్డి, బల్వంత్‌రెడ్డి, వీరేశం, మల్లారెడ్డి, మహేశ్, రైతులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గుల రైతువేదికలో..

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల రైతువేదికలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు నాయకులు, అధికారులు, రైతులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో రైతు వేదికకు బయలుదేరి వచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, ఎంపీడీఓ బన్సీలాల్, ఇన్‌చార్జి ఏడీ నిషాంత్‌కుమార్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, ఎండీ.ఇబ్రహీం, రఘునాయక్, రఘుగౌడ్, రవీందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు, నాయకులు



షాద్‌నగర్‌రూరల్: రైతు వేదికకు తరలివెళ్తున్న నాయకులు, అధికారులు

వీసీ యూనిట్స్ ద్వారా..

కొందుర్గు: మండలంలోని ముట్పూర్, తంగెళ్లపల్లి, జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలోని ఎదిర, పెద్దఎల్కిచర్ల రైతు వేదికల్లో సోమవారం వీసీ యూనిట్స్ ప్రారంభించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా కార్యక్రమం ప్రారంభించగా రైతులందరూ ఆయా రైతు వేదికల్లో వీసీ యూనిట్స్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, ఏఓలు సురేశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లో సోమవారం మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు తిలకించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో ర్యాలీ..

శంకర్‌పల్లి: మండలంలోని మహాలింగాపురం, పర్వేద, మోకిల గ్రామాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అయితే మహాలింగాపురంలో నాయకులు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించగా తహసీల్దార్ సురేందర్ పాల్గొని రైతునేస్తంపై అవగాహన కల్పించారు. మోకిలలో మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

షాబాద్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి, మాచన్‌పల్లి, షాబాద్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏండీ అన్వర్, ఎంపీడీఓ అపర్ణ, మండల వ్యసాయ అధికార వెంకటేషం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, నాయకులు చేవెళ్ల స్వామి, సూర్యగౌడ్, సుభాష్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పంతులు, మాణ్యంగౌడ్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



షాబాద్: మాచన్‌పల్లి రైతు వేదికలో..



మొయినాబాద్‌రూరల్: రైతు నేస్తం కార్యక్రమాన్ని తిలకిస్తున్న అధికారులు, రైతులు

పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించండి

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా మన ఊరి బడిలో చేర్పించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నర్సింలు ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించి డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షబానాభేగం, కవిత, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

సామాజిక సేవా ధృక్పథాన్ని కలిగి ఉండాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా ధృక్పథాన్ని కలిగి ఉండాలని సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ, మండలంలోని గ్రామా ల్లో పోలీసీ శాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు కేబుల్ వైర్, ఇంటర్‌నెట్ సౌకర్యంతో పాటు సర్వీసులు కల్పించేందుకు ముందుకొచ్చిన దాత చేవెళ్లకు చెందిన సినిమా థియేటర్ నారాయణ, దామోదర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

‘కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు సరికాదు’



మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి గ్రామంలో పర్యటిస్తే తెలుస్తుందని, కాంగ్రెస్ నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని బీఆర్‌ఎస్ యువ నాయకులు రమేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతకుంటపల్లిలో గ్రామ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఓ నాయకుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో పాతిన కడీలను తొలగించారన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తనను ఏకవచనంతో సంభోదించారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చింతకుంటపల్లి గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిందిగా గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో పలు అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటారని, కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పర్యటించి నిజాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటయ్య, మల్లేశ్, శ్రీనివాస్, శ్రీశైలం, మహేందర్, కాశీం అలీ, శ్రీకాంత్, రమేశ్, మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.